ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 4 ఆగస్టు 2025



పసుపు కొమ్ముల అలంకరణలో నూకాంబిక అమ్మవారు



అనకాపల్లి నూకాంబిక అమ్మవారు ఆదివారం పసుపుకొమ్ముల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణవాసులే కాకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

- అనకాపల్లి టౌన్/ ఆంధ్రజ్యోతి

ఘనంగా స్నేహితుల దినోత్సవం

ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వయసుతో సంబంధం లేకుండా చిన్ననాటి నుంచి కలిసిమెలిసి తిరిగిన స్నేహితులు పాఠశాలలు, పార్కులు, పర్యాటక ప్రదేశాల్లో సమావేశమై ఉల్లాసంగా గడిపారు. పరస్పరం ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాగా ఎలమంచిలిలో 1992-93 విద్యా సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన వారు సుమారు రెండున్నర దశాబ్దాల నుంచి ఏటా స్నేహితుల దినోత్సవాన్ని క్రమం తప్పకుండా జరుపుకుంటున్నారు. ఈ ఏడాది వినూత్న రీతిలో 150 అడుగుల పొడవున, జాతీయ జెండా తరహాలో మూడు రంగులతో భారీ ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌ను తయారు చేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



ఎలమంచిలి ప్రదర్శిస్తున్న 150 అడుగుల ఫ్రెండ్ షిప్ బ్యాండ్

కష్టాల్లో అన్నదాతలు

- వేసవిని తలపించేలా ఎండలు
- ఆకుమడుల్లో ఎండిపోతున్న వరి నారు
- చుక్కనీరు లేని చెరువులు
- మొదలుకాని దమ్ము, వరినాట్లు పనులు
- కోనాం, రైవాడ రిజర్వాయర్ల నుంచి వారం క్రితమే నీరు విడుదల
- ఆయకట్టు చివరి భూములకు ఇంతవరకు చేరని నీరు
- 20 శాతం విస్తీర్ణంలోనే వరినాట్లు పూర్తి
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

చీడికాడ/దేవరాపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో సాగునీటి జలాశయాలు వున్నప్పటికీ వరినాట్లు సకాలంలో వేసే పరిస్థితి లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దాదాపు పది రోజుల నుంచి చినుకు జాడ లేదు. మరోవైపు వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. రైవాడ, కోనాం రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసినప్పటికీ, కాలువల చివర వున్న భూములకు నీరు చేరడంలేదు. వర్షాలు పడకపోవడంతో పొలాలను దమ్ము చేయడానికి రెండు, మూడు రెట్లు అధికంగా నీరు అవసరం అవుతున్నది. నాట్లు వేసేటప్పుడు, ఆ తరువాత కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఆకు మడుల్లో వరి నారు అందుబాటులోకి వచ్చినప్పటికీ నాట్లు వేయలేక, నారు ముదిరిపోతున్నదని రైతులు వాపోతున్నారు. మరోవైపు ఖరీఫ్ సీజన్ ఆరంభమై రెండు నెలలు దాటినా చెరువుల్లో కనీస స్థాయిలో కూడా నీరు చేరలేదు. వరినారును కాపాడుకోవడానికి సమీపంలో వున్న బావులు, చెరువుల నుంచి ఆయిల్ ఇంజన్లతో నీటిని పెట్టుకోవాల్సి వస్తున్నది. చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' గ్రౌండ్ రిపోర్ట్..

చీడికాడ మండలంలో కోనాం జలాశయం కింద ఎనిమిది వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇది కాకుండా చెరువుల కింద దాదాపు రెండు వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. కోనాం జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు అంతగా కురవకపోవడంతో రిజర్వాయర్‌లోకి ఆశించినమేర నీరు చేరలేదు. ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 94.5 మీటర్లు మాత్రమే వుంది. పంట కాలువలకు గత నెల 25వ తేదీన నీటి విడుదలను ప్రారంభించారు. అప్పటి నుంచి ఎగువ కాలువకు 30 క్యూసెక్కులు, దిగువ కాలువకు 70 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. అయితే గత పది రోజుల నుంచి వర్షాలు పడకపోవడం, వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండడంతో రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లో ఆశాజనంగా లేదు. ఇదే సమయంలో దమ్ము, వరి నాట్లు వేయడానికి నీటి అవసరం పెరిగింది. కాలువలకు ఆనుకొని వున్న భూముల్లో మాత్రమే వరినాట్లు వేస్తున్నారు. కాలువల చివరి భూములకు నీరు అందకపోవడంతో దమ్ము, వరినాట్లు పనులు చేపట్టలేదు. వ్యవసాయ, జలవనరుల శాఖ అధికారుల గణాంకాల ప్రకారం ఇంతవరకు 20 శాతం ఆయకట్టులో మాత్రమే వరినాట్లు వేశారు. మిగిలిన విస్తీర్ణంలో దమ్ము చేసి, వరినాట్లు వేయడానికి రిజర్వాయర్‌లో ప్రస్తుతం వున్న నీరు చాలదు. సకాలంలో వరి నాట్లు వేయకపోతే నారు ముదిరిపోతుందని రైతులు ఆందోళచెందుతున్నారు. ఎండల కారణంగా వరినారును బతికించుకోవడానికి నానాపాట్లు పడాల్సి వస్తున్నదని వాపోతున్నారు. కుంటలు, బావుల్లో నుంచి బిందెలు, కుండలతో నీటిని తెచ్చుకుని నారు మడులను తడుపుకుంటున్నారు. గత ఏడాది ఇదే సమయంతోపోలిస్తే రిజర్వాయర్‌లో మూడు మీటర్ల తక్కువ నీరు వుండడం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నది.

ఇదిలా వుండగా మండలంలో కోనాం, మంచాల, వెల్లంకి, నీలంపేట, ఎస్.కొత్తూరు, చీడిపల్లి, పెదగోగాడ, అర్జునగిరి, చుక్కపల్లి, చెట్టుపల్లి గ్రామాల్లో చెరువుల కింద సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టు ... మిగతా 6వ పేజీలో

పది రోజుల నుంచి జాడలేని చినుకు



చీడికాడ మండలం మంచాలలో వరినాట్లు వేయకపోవడంతో ఖాళీగా వున్న పొలాలు



దేవరాపల్లి మండలం నాగయ్యపేటలో నీరు లేక ఎండిపోతున్న వరినాట్లు



కోనాంలో నీరు లేక ఎండిపోతున్న వరినారు

ఇంతవరకు కాలువ నీరు రాలేదు



కోనాం జలాశయం నుంచి గత నెల 25వ తేదీన కాలువలకు నీటి విడుదలను ప్రారంభించారు. సాధారణంగా వారం రోజుల్లో ఆయకట్టు చివరి భూములకు కూడా నీరు చేరుతుంది. కానీ కొద్ది రోజుల నుంచి వర్షాలు పడకపోవడంతో కాలువలకు ఆనుకొని వున్న భూములకే నీరు వస్తున్నది. ఆయకట్టు చివరనున్న దిబ్బపాలెం, దండిసురవరం, తునివలస గ్రామాల భూములకు నీరు ఎప్పుడు అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

దారపు మండేలు, నీటిసంఘం అధ్యక్షుడు, దిబ్బపాలెం, చీడికాడ



చుక్కనీరు లేని కోనాం పెద్ద చెరువు

సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు

అనకాపల్లిలో 37.7 డిగ్రీలు నమోదు

ఉదయం పది గంటల నుంచి నిర్మానుష్యంగా రహదారులు



ఎండ తీవ్రతతో బోసిపోయిన అనకాపల్లి ఎన్టీఆర్ జంక్షన్

అనకాపల్లి టౌన్/ చోడవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

జిల్లా అంతటా ఆదివారం కూడా వేసవిని తలపించేలా వేడి వాతావరణం నెలకొంది. గత వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించే ఉష్ణోగ్రతలకన్నా రెండు, మూడు డిగ్రీలు అధికంగా వున్నట్టుగా వుంది పరిస్థితి. జోరుగా వర్షాలు కురవాల్సిన సమయంలో ఎండ తీక్షణంగా కాస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. అనకాపల్లిలో గత ఐదు రోజుల ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. 28వ తేదీన 35.6 డిగ్రీలు, 29వ తేదీన 35.3, 30వ తేదీన 35.8, 31వ తేదీన 35.3, ఈ నెల ఒకటిన 37.3, రెండో తేదీన 37.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం మరికొంత పెరిగి 37.7 డిగ్రీలు నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీక్షణంగా కాస్తుండడంతో పది గంటల నుంచి రోడ్లపై జనసంచారం తగ్గిపోతున్నది. రాత్రి సమయంలో కూడా వేడి వాతావరణంతోపాటు ఉక్కపోతతో జనం ఇబ్బంది పడుతున్నారు.



జన సంచారం లేని చోడవరం మెయిన్ రోడ్డు

శరవేగంగా పందూరు వంతెన పనులు

రూ.5.75 కోట్లు మంజూరు చేయించిన హోం మంత్రి అనిత

- వచ్చే ఏడాది ఏప్రిల్ నాటి పూర్తి చేయాలని లక్ష్యం
- మూడు గ్రామాల ప్రజలకు తీరనున్న రవాణా కష్టాలు



పందూరు వంతెనపై శ్లాబ్ నిర్మాణ పనులు..

కోటవురట్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

మండలంలో పందూరు వద్ద వరహా నదిపై వంతెన నిర్మాణ పనులు ఊపందు కున్నాయి. కొద్ది రోజుల నుంచి ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో నదిలో నీటి ప్రవాహం లేదు. దీంతో వంతెన శ్లాబ్ పనులకు ఎటువంటి ఆటంకం కలగడంలేదు. వాస్తవంగా ఈ వంతెన ఎప్పుడో ఐదేళ్ల క్రితం పూర్తవ్వాల్సి వుంది. కానీ వైసీపీ అధికారంలో వున్నప్పుడు నిధులు మంజూరు చేయకపోవడంతో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పనులను పునరుద్ధరించారు. వివరాల్లోకి వెళితే..

వరహా నదికి 2012 నవంబరులో భారీగా వరద పోటెత్తడంతో పందూరు వద్ద వంతెన కొట్టుకుపోయింది. దీంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ కొత్త వంతెన నిర్మాణం కోసం రాష్ట్ర విభజనకు ముందు 2013లో రూ.6 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయిన తరువాత 2014 ఏప్రిల్‌లో కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ జరిగింది. 2015 మార్చి 5న అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2017 డిసెంబరునాటికి శ్లాబ్ మినహా మిగిలిన పనులు పూర్తయ్యాయి. నిధులు మంజూరు అయ్యేనాటికి వున్న ధరలతో పోలిస్తే ... మిగతా 6వ పేజీలో

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

మునగపాక, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5 వేలు, పీఎం కిసాన్ కింద రూ.2 వేల నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో అన్నదాతల ఆనందానికి అవధులు లేవు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ రెండు పథకాల కింద రైతులకు శనివారం తొలివిడత నిధులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో అర్హులైన ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.7 వేల చొప్పున జమ అవుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక కొత్తమహాలక్ష్మి పురిటిగెడ్డ ప్రాంతంలో రైతులు ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ మాట్లాడుతూ, మునగపాక మండలంలో మండల వ్యాప్తంగా సుమారు తొమ్మిది వేల మంది రైతుల రూ.6 కోట్ల పెట్టుబడి సాయం అందున్నదని చెప్పారు. మిగిలిన రూ.13 వేలు వచ్చే ఏడాది మార్చిలోపు రెండు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, దాడి శివ, విల్లూరి నరసింగరావు, బుద్ద వెంకటి, భీమునాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సముద్ర తీరంలో ఇసుక దొంగలు

రాత్రి పూట తవ్వకాలు, తరలింపు

- నది ఇసుకతో కలిపి అమ్మకాలు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

ఇసుక అక్రమార్కులు సహజ వనరుల్లో దేనిని వదలడంలేదు. నదులు, గెడ్డలు, వాగుల్లో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరుపుతూ, పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్న వారి కన్ను ఇప్పుడు సముద్ర తీరంలోని ఇసుకపై పడింది. పాయకరావుపేట మండలంలోని వెంకటనగరం, రాజానగరం వద్ద సముద్ర తీరం వెంబడి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. రాత్రి పది గంటల తరువాత జన సంచారంలేని సమయంలో యంత్రాలు, కూలీలతో ఇసుక తవ్వి, ట్రాక్టర్లలో తరలించుకుపోతున్నారు. వాస్తవంగా సముద్రం ఇసుక భవన నిర్మాణాలకు పనికిరాదు. కానీ అక్రమార్కులు రాజమహేంద్రవరం వద్ద గోదావరి నుంచి ఇసుకను తెచ్చి, ఇందులో సముద్రం ఇసుకను కలిపి విక్రయిస్తున్నట్టు తెలిసింది. గతంలో కేశవరం సమీపంలో జిరాయితీ భూముల్లో గనుల శాఖ నుంచి ... మిగతా 6వ పేజీలో



రాజానగరం వద్ద సముద్ర తీరంలో ఇసుక తవ్వకుపోయిన దృశ్యం

దేవరాపల్లిలో వైసీపీ జడ్పీటీసీ సభ్యుల సమావేశం రేపు

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ జడ్పీటీసీ సభ్యుల సమావేశం ఈ నెల ఐదో తేదీన దేవరాపల్లి మండలం మామిడిపల్లిలో జరగనున్నది. వైసీపీ జడ్పీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు కర్రి సత్యం (దేవరాపల్లి సభ్యుడు) అధ్యక్షతన సమావేశం కానున్నారు. గ్రామదేవత పండుగతోపాటు ఫోరం అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా ఆయన ఉమ్మడి జిల్లాలో వైసీపీ జడ్పీటీసీ సభ్యులకు ఆహ్వానం పంపారు. అయితే జడ్పీ చైర్‌పర్సన్‌కు, వైసీపీ జడ్పీటీసీ సభ్యులకు మధ్య విభేదాలు ఉన్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించడం పలు ఊహాగానాలకు తావిస్తున్నది.

తారు వేయకుండా వదిలేసిన కొల్లివానిపాలెం రోడ్డు

పిక్కలు పైకితేలి వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్థులు వినతి


రాళ్లు పైకి తేలిన కొల్లివానిపాలెం రోడ్డు

అచ్యుతాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గండివానిపాలెం నుంచి రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేయడంతో కొల్లివానిపాలెం వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏఐఐబీ ఆర్థిక సహకారంతో ప్రారంభమైన రోడ్డు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలో వదిలేసి వెళ్లిపోయారు. మడతూరు జంక్షన్-తంతడి ఆర్అండ్‌బీ రోడ్డులో గల గండివానిపాలెం నుంచి కొల్లివానిపాలెం వరకు 2.4 కిలోమీటర్ల రోడ్డును ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు ఆర్థిక సహాయంతో 2023 మార్చి 31న తారు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. 2024 మార్చి 30 నాటికి రోడ్డు పనులు పూర్తిచేయాలని గడువు విధించారు. రోడ్డు నిర్మాణానికి రూ.170.80 లక్షలు మంజూరు చేశారు. రోడ్డు పనులు ప్రారంభించి పిక్క కూడా వేసేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. ప్రస్తుతం రోడ్డుపై పిక్క తేలి కనీసం నడవడానికి కూడా ఇబ్బందిగా ఉంటోంది. ద్విచక్రవాహనాలు, ఆటోల టైర్లకు పిక్కలు గుచ్చుకొని పంక్చర్‌లు అయిపోతున్నాయని గ్రామస్థులు అంటున్నారు. కూటమి ప్రభుత్వమైనా పట్టించుకొని రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని కొల్లివానిపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.

శరవేగంగా పందూరు వంతెన పనులు

... 5వ పేజీ తరువాయి

నిర్మాణ సామగ్రి ధరలు బాగా పెరగడంతో ప్రభుత్వం కేటాయించిన రూ.6 కోట్లతో ఇంతవరకే పనులు అయ్యాయంటూ కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అధికారులు మళ్లీ అంచనాలు తయారు చేసి రూ.3 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తరువాత 2018 అక్టోబరుతో కాంట్రాక్టు గడువు ముగియడం, మరుసటి ఏడాది ఫిబ్రవరిలో ఎమ్మెల్సీ (ఉపాధ్యాయ) ఎన్నికల కోడ్, మార్చిలో సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వం నిధులు విడుదల చేయలేని పరిస్థితి ఏర్పడింది. సాధారణ ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు మిగిలిన అభివృద్ధి పనుల మాదిరిగానే పందూరు వంతెనను కూడా అటకెక్కించారు. అప్పటి నుంచి ఏటా ప్రతిపాదనలు పంపడం, రాజధాని స్థాయిలో బుట్టదాఖలు చేయడం ఆనవాయితీగా మారింది.

కూటమి ప్రభుత్వం రాకతో వంతెన పనుల్లో కదలిక

గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోం మంత్రి అనిత, పందూరు వంతెనపై ప్రత్యేక దృష్టి సారించారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి, వంతెన నిర్మాణానికి రూ.5.75 కోట్లు మంజూరు చేయించారు. ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన శంకుస్థాపన చేశారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్ పనులు వెంటనే మొదలుపెట్టారు. గతంలోనే పిల్లర్స్ నిర్మాణం పూర్తికావడంతో ఇప్పుడు వాటిపై రెండు వైపుల నుంచి శ్లాబులు వేస్తున్నారు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహన లేకపోవడంతో వంతెన నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకం కలగడం లేదని అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌నాటికి పనులు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

కష్టాల్లో అన్నదాతలు

... 5వ పేజీ తరువాయి

వుంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువుల్లో నీరు చేరలేదు. దీంతో ఒక్క ఎకరంలో కూడా వరినాట్లు వేయలేదు. ఆకుమడులు బీటలు వారి వరి నారు ఎండిపోతున్నది. పొలాలను దమ్ము పట్టాల్సిన సమయంలో, దుక్కి దున్నుకుంటున్నారు. వారం రోజుల్లో వర్షాలు కురవకపోతే వరిసాగు లేనట్టేనని చెరువుల ఆయకట్టు రైతులు అంటున్నారు.

దేవరాపల్లి మండలంలో..

రైవాడ జలాశయం నుంచి గత వారం నీటిని విడుదల చేయగా, ఇప్పుడిప్పుడే దమ్ము, నాట్లు పనులు మొదలయ్యాయి. అయితే కాలువల చివరనున్న భూములకు ఇంకా నీరుచేరలేదు. ఈ కారణంగా వరినాట్లు కొంత ఆలస్యం అయ్యే అవకాశం వుందని రైతులు చెబుతున్నారు. ఇదిలావుండగా మండలంలోని నాగయ్యపేట, సీతంపేట వెంకటరాజపురం, తెనుగుపూడి, గర్నింగి, వాకపల్లి, తామరబ్బ, సోంపురం, సమ్మెద, చింతలపూడి తదితర గ్రామాల్లో వర్షాధార చెరువుల కింద వరి సాగు చేస్తుంటారు. పది రోజుల క్రితం కురిసిన వర్షాలతో కొంతమంది నాట్లు వేయగా, అనంతరం వర్షం లేకపోవడంతోపాటు ఎండలు మండిపోతుండడంతో వరినాట్లు ఎండిపోతున్నాయి. సాధారణంగా జూలై చివరినాటికి వరినాట్లుపూర్తవుతాయి. అయితే వర్షాభావం వల్ల చెరువుల్లో అరకొరగా నీరు చేరడం, నాట్లువేయడానికి సరిపడ నీరు లేకపోవడంతో ఇంతవరకు 20 శాతం విస్తీర్ణంలో కూడా వరినాట్లు వేయలేదు. కొంతమంది రైతులు సుమారు కిలోమీటర్ దూరంలో వున్న ఇతర రైతులకు చెందిన బోర్లు నుంచి ట్యూబుల ద్వారా నీటి తీసుకొని వరినాట్లు వేసుకుంటున్నారు.

సముద్ర తీరంలో ఇసుక దొంగలు

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, విక్రయాలు జరిపేవారు. అయితే ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి అయిన అనిత, మండల అధికారులను ఆదేశించడంతో ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. దీంతో అక్రమార్కుల కన్ను సముద్ర తీరంలోని ఇసుకపై పడింది. రెవెన్యూ, పోలీసు, గనులు, అటవీ శాఖల అధికారులు సముద్ర తీర ప్రాంతంలో నిఘా పెట్టి, ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చుర్రుమనిపిస్తున్న సూరీడు

- వర్షాకాలంలో వేసవికి మించి ఎండలు
- ఉక్కిరిబిక్కిరవుతున్న జనం
- బయటకు రావాలంటే భయపడుతున్న ప్రజలు
- వెలవెలబోతున్న ప్రధాన కూడళ్లు


ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన రాంబిల్లి ఎంపీడీవో కార్యాలయం సెంటర్


జన సంచారం లేక బోసిపోయిన కోటవురట్ల మెయిన్ రోడ్డు

రాంబిల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా సూరీడు ఉగ్రరూపాన్ని చూపిస్తున్నాడు. రోజు రోజుకు ఎండలు మండిపోతున్నాయి. ఇంటా బయటా ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు మండిపోతున్నాడు. వడగాడ్పులతో కూడిన ఎండ కాస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. వృద్ధులు, చంటి పిల్లలు ఎంత తీవ్రతను తట్టుకోలేక తల్లడిల్లిపోతున్నారు. ఎండ సమయంలో ఇళ్లలోని వారు చెట్లు, కమ్మల పందెర్లు, పాకలు వద్దకు పోయి సేద దీరుతున్నారు. ఎండ కారణంగా వ్యాపారాలు కూడా సాగడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం జనసంచారంతో రద్దీగా ఉండే ప్రధాన రోడ్లు, జంక్షన్‌లు నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. వర్షాకాలంలో వేసవికి మించి ఎండలు కాస్తుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరోపక్క విద్యుత్ కోతలు అధికంగా ఉండడంతో మరింతగా ఇబ్బందులు పడుతున్నామని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోటవురట్లలో..

వేసవి మాదిరిగా వర్షకాలంలో భానుడు భగభగ మండుతున్నాడు. గత పది రోజుల నుంచి ఎండలకు జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వడగాడ్పులు, ఉక్కపోతకు వృద్ధులు, పిల్లలు అపసోపాలు పడుతున్నారు. ఎండల తీవ్రతకు ఇంటిలో ఏ వస్తువు పట్టుకున్న కాలిపోతున్నాయి. సాయంత్రం 5 గంటలు దాటినా వడగాడ్పులు తగ్గడం లేదు. ఉదయం 10గంటల నుంచి జనం రోడ్డుపైకి రావడానికి భయపడుతున్నారు. ఆదివారం ఉష్ణోగ్రత 35 డిగ్రీలు నమోదైంది. మధ్యాహ్న సమయాల్లో ప్రధాన రహదారులపై జనసంచారం లేదు.

ఎలమంచిలిలో వినూత్నంగా స్నేహితుల దినోత్సవం

- 150 అడుగుల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌తో పురవీధుల్లో ప్రదర్శన
- మృతి చెందిన స్నేహితుడి జ్ఞాపకార్థం నాటిన మొక్కకు కట్టిన 150 అడుగుల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్


స్నేహితుడి జ్ఞాపకార్థం పెంచిన చెట్టుకు 150 అడుగుల ఫ్రెండ్‌షిప్ బ్యాండును కడుతున్న స్నేహితులు

ఎలమంచిలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో ఆదివారం ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్నేహితుల దినోత్సవాన్ని వినూత్న రీతిలో జరుపుకున్నారు. మృతి చెందిన స్నేహితుడి జ్ఞాపకార్థం 150 అడుగుల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ను 3 రంగులతో తయారు చేసి పురవీధుల్లో ప్రదర్శించి, ఆ చెట్టుకు కట్టి నివాళులర్పించారు.

ఎలమంచిలి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93 సంవత్సరంలో ఒమ్మి వీరభద్రరావు, ఖాసిం, తదితరులు పదో తరగతి పూర్తి చేశారు. వీరిలో వీరభద్రరావు 2005లో ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. దీంతో ఆ టెన్త్ బ్యాచ్‌కి చెందిన మిత్రులంతా 2006లో పాతవీధిలోని హైస్కూల్ వద్ద మొక్కను నాటి, దానిని పెంచారు. ప్రతి ఏటా ఆ చెట్టు వద్ద స్నేహితుల దినోత్సవం నాడు వీరభద్రరావుకు నివాళులర్పిస్తున్నారు. ఈ ఏడాది వినూత్నంగా చేయాలని స్నేహితులు, కుటుంబ సభ్యులు భావించారు. వీరిలో ఖాసిం అనే స్నేహితుడు జాతీయ భావం, స్నేహ బంధానికి ప్రతీకగా ఉండేలా జాతీయ జెండాలోని రంగుల మేళవింపుతో 150 అడుగుల పొడవున ఉండేలా ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ను రూపొందించారు. ఈ బ్యాండ్ మధ్యలో వీరభద్రరావు ఫొటో ఏర్పాటు చేశారు. స్నేహితులంతా కలిసి ఈ 150 అడుగుల ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌తో సైతారుపేట రోడ్డు జంక్షన్ మీదుగా పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్నేహితుడి జ్ఞాపకార్థం వేసిన చెట్టుకు ఫ్రెండ్‌షిప్ బ్యాండును ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాసిం, మురుకుర్తి రమణ, రేఖా శివ, సాయి, కడిమిశెట్టి సతీష్, ఆరెపు చిన్న గుప్తా, దుప్పట్ల శంకరరావు, ఒమ్మి అప్పారావు, సత్యనారాయణ లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం


23వ వార్డులో స్నేహితుల దినోత్సవం జరుపుకుంటున్న స్థానికులు

ఎలమంచిలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని మునిసిపాలిటీతో పాటు మండలంలో అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. స్నేహబంధానికి ప్రతీకగా ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టుకున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్నివర్గాల వారు స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. మునిసిపాలిటీ కొక్కిరాపల్లిలో నూకాంబికా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం యువతీ, యువకులు స్నేహితుల దినోత్సవాన్ని ఆనందంగా జరపుకున్నారు.

మునగపాకలో..

మండల వ్యాప్తంగా స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వయసుతో సంబంధం లేకుండా వేడుకలు నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలు మిత్రులతో సందడిగా గడిపారు. స్నేహ ప్రస్థానంలో చోటుచేసుకున్న అంశాలను గుర్తుకు తెచ్చుకున్నారు. రక్తబంధం కంటే మిన్నగా స్నేహబంధాన్ని కొనసాగిద్దామని ప్రతిజ్ఞ చేశారు.

నానాజీకి దొప్పెర్ల గ్రామస్థుల సన్మానం


నానాజీని సన్మానిస్తున్న గ్రామస్థులు

అచ్యుతాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ పరీక్షల్లో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించిన గండి నానాజీని దొప్పెర్ల గ్రామస్థులు ఆదివారం సన్మానించారు. నిరుపేద రైతు కుటుంబంలో జన్మించిన నానాజీ కష్టపడి చదివి కానిస్టేబుల్ ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించారు. మండలంలో మారుమూల గ్రామమైన దొప్పెర్ల గ్రామానికి రాష్ట్ర స్థాయిలో పేరు తెచ్చిన నానాజీని గ్రామస్థులంతా ఆదివారం సత్కరించారు. మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పల్లి శేషగిరిరావు, దొప్పెర్ల టీడీపీ గ్రామ అధ్యక్షుడు కొల్లి వరహాలరావు, బార్క్ సైంటిస్ట్ బండారు కిరణ్, బొగంటి దేముడు తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయానికి శంకుస్థాపన


మరిడిమాంబ ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆలయాలు భారతీయ సంస్కృతికి ప్రతీకలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మండలంలోని కొత్త మోసయ్యపేటలో నూతనంగా నిర్మించనున్న మరిడిమాంబ అమ్మవారి ఆలయానికి ఎమ్మెల్యే విజయకుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, పుర్రే శ్రీనివాసయాదవ్, ఈగల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో పందుల స్వైరవిహారం

- పలు కాలనీల్లో విపరీతంగా సంచారం
- వ్యాధులు ప్రబలుతాయని పట్టణవాసుల భయాందోళన
- పట్టించుకోని ప్రజారోగ్య శాఖ అధికారులు


ఎలమంచిలి ఎంపీడీఓ కార్యాలయం ముందు సంచరిస్తున్న పందుల గుంపు

ఎలమంచిలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణంలో పందులు సంచారం విపరీతంగా పెరిగింది. ప్రధాన వీధులు, జనసంచారం ఉండే ప్రాంతాలతో పాటు నివాస ప్రాంతాల వద్ద పందులు ఆవాసం ఏర్పాటు చేసుకుని రోజులు తరబడి ఉండిపోతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా కొత్తపేట, మిలట్రీ కాలనీ, గాంధీనగర్, ధర్మవరం, ఏఎస్ఆర్ కాలనీ, రైల్వే స్టేషన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో పందుల సంచారం విపరీతంగా ఉంది. పట్టణంలో నివాస ప్రాంతాలు మీదుగా విస్తరించిన యానాద్రి కాలువను ఆనుకుని పందులు సంచరిస్తుండడంతో పట్టణ ప్రజలకు అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు గుట్టుచప్పుడు కాకుండా పందులను తీసుకువచ్చి పట్టణంలో విడిచిపెడుతున్నారు. గతంలో పట్టణంలో డెంగ్యూ బారిన పడిన వారిని పరిగణనలోకి తీసుకుని ప్రజారోగ్య శాఖ అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

తెలుగు యువత మండల అధ్యక్షుడిగా శివరామకృష్ణ




శివరామకృష్ణను అభినందిస్తున్న వెంకటేశ్, టీడీపీ నాయకులు

నక్కపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత మండల అధ్యక్షుడిగా వేంపాడు గ్రామానికి చెందిన కె.శివరామకృష్ణ రాజు నియమితులయ్యారు. టీడీపీలో చురుకైన కార్యకర్తగా శివరామకృష్ణకు మంచి గుర్తింపు వుంది. తెలుగు యువత మండల శాఖ పగ్గాలను ఆయనకు హోం మంత్రి అనిత అప్పగించారు. ఈ విషయాన్ని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ ఆదివారం ప్రకటించారు. నక్కపల్లి టీడీపీ కార్యాలయంలో ఆదివారం శివరామకృష్ణరాజును వెంకటేశ్ సహా టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్‌కొప్పిశెట్టి బుజ్జి, వేంపాడు ఎంపీటీసీ సభ్యుడు కుంచె మధు, ఉప సర్పంచ్ అప్పలరాజు, పల్లా రాంబాబు తదితరులు అభినందించారు.

ఆశాజనకంగా నువ్వు, గంటి పంటలు

రాంబిల్లి ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నువ్వు, గంటి పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. వాతావరణం అనుకూలించడంతో ఏ ఏడాది ఖరీఫ్‌లో అప్పారాయుడుపాలెం, పంచదార్ల, దిమిలి, అప్పన్నపాలెం, హరిపురం, కొండవారపాలెం, లాలంకోడూరు, దిమిలి పరిసర గ్రామాల్లో 100 ఎకరాల్లో నువ్వు, గంటి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గంటి పంట వెన్నుకట్టి గింజ కట్టే స్థితిలో ఉండగా, నువ్వుపంట కాయలు కాసి గింజ కట్టే స్థితిలో ఉన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో కొన్ని గ్రామాల్లోని కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న నువ్వు పంట ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు. నెల రోజుల్లో పంట పండి చేతికందుతుందని, మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


అప్పారాయుడుపాలెంలో నువ్వు పంట

రైలు ఢీకొని మహిళ మృతి

ఎలమంచిలి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదపల్లి రైల్వే గేటు సమీపంలో ఆదివారం రాత్రి రైలు ట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని మహిళ మృతి చెందింది. అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లుతున్న రైలు మహిళను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. మృతి చెందిన మహిళ ఎవరన్నది పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

18 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

మునగపాక, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీలు జరగనున్నాయని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో నాగులాపల్లిలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ వరకు జరగనున్న పోటీలలో ఎనిమిది జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీలో పాల్గొంటారని తెలిపారు. మూడు రోజులు పాటు ఈ పోటీలు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో జరుగుతాయని చెప్పారు. 20వ తేదీన ఫైనల్ పోటీలు జరుగుతాయని, అదే రోజు బహుమతులు అందజేస్తామన్నారు. టీడీపీ నాయకుడు దొడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పుట్టిన రోజు పురస్కరించుకొని పోటీలు జరగనున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో కబడ్డీ అసోసియేసన్ రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ యాదవ్, జిల్లా కార్యదర్శి పి.కోటేశ్వరరావు, శాంకేతిక కమిటీ ప్రతినిధి ఎం.గణపతిరావు, కన్వీనర్ సత్యనారాయణ మాస్టార్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలికల అప్పగింత

పాయకరావుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో చెప్పకుండా ఆదివారం దువ్వాడలో రైలు ఎక్కిన ఇద్దరు బాలికలను తునిలో ప్రభుత్వ రైల్వే పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విశాఖపట్నంలోని అగనంపూడికి చెందిన ఇద్దరు బాలికలు ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లిపోయారని సమాచారం అందడంతో తుని రైల్వే స్టేషన్ సిబ్బంది ఎస్.నానిబాబు, మోహనరావు రైళ్లలో తనిఖీ చేయడం ప్రారంభించారు. అలానే బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు బాలికలను కనుగొని వారిని రైలు నుంచి దించారు. స్టేషన్‌కు తీసుకువచ్చి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా రైలు ఎక్కాలని నిర్ణయించుకుని దువ్వాడ స్టేషన్‌లో రైలు ఎక్కామన్నారు. దీంతో వారి తల్లిదండ్రులను తుని రైల్వే పోలీస్ స్టేషన్‌కి పిలిపించి, ఇద్దరు బాలికలను అప్పగించినట్టు ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

'కూటమి నేతలు గ్రావెల్ అక్రమ తవ్వకాలు'

అచ్యుతాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారని జెడ్‌పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శనివారం రాత్రి వెదురువాడ వద్ద భారీగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టారని, తాము అడ్డుకోటానికి ప్రయత్నించినా ఎదురుదాడికి దిగారన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై తాము ఆందోళన చేపడతామన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఎస్.రాయవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు, భీమవరం, గోకులపాడు, పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం, నీలాద్రిపురం, కోనవానిపాలెం, కొరుప్రోలు గ్రామాలతో పాటు నక్కపల్లి మండలం, పెదబోదిగల్లం, పెదదొడ్డుగొల్లు, రామకృష్ణపురం, సీతమ్మపాలెం గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె రాజశేఖర్ ఆదివారం తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులకు వైద్య సేవలు అందజేస్తున్న వైద్యులు

మునగపాక, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంబమూర్తి దేవస్థానం కల్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గణేష్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాన్ని విఘ్నేశ్వరస్వామి దేవస్థానం కమిటీ ఛైర్మన్ మందపాటి రాము ప్రారంభించారు. ఈ శిబిరంలో 120 మంది రోగులు వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధి దాడి శ్రీరామ్మూర్తి, సర్పంచ్ దిమ్మల అప్పారావు, సూరిశెట్టి కన్నారావు, అలంక ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

నక్కపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీన నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న బల్క్‌డ్రగ్ పార్కు ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి ప్రభుత్వం తయారు చేసిన పర్యావరణ ప్రభావిత నివేదిక తప్పుల తడకగా వుందన్నారు. ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న బల్క్‌డ్రగ్ పార్కు ప్రజాభిప్రాయ సేకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.రాజేశ్, దేవర నాగేశ్వరరావు వున్నారు.

సహ విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):తమతో చదువుకున్న వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని తోటి విద్యార్థులు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. 2005-06 విద్యా సంవత్సరంలో అచ్యుతాపురంలో పదవ తరగతి చదివిన జంగులూరుకి చెందిన కొల్లి రాజు జూన్ మూడున మృతి చెందాడు. దీంతో వృద్ధులైన తల్లిదండ్రులు అనాథలుగా మిగిలారు. ఈ విషయం తెలుసుకున్న అతనితో పాటు చదువుకున్న వారంతా విరాళాలు సేకరించారు. ఈ విధంగా సేకరించిన రూ.65 వేలు రాజు తండ్రి అప్పలనాయుడికి ఆదివారం అందజేశారు.

పసుపు కొమ్ములతో పసిడి కాంతుల అమ్మ

▸▸ విశేష అలంకరణలో దర్శనమిచ్చిన నూకాంబిక అమ్మవారు

▸▸ సెలవు దినం కావడంతో భారీగా తరలి వచ్చిన భక్తజనం




పసుపుకొమ్ముల అలంకరణలో ఉన్న అమ్మను దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారు ఆదివారం పసుపుకొమ్ముల అలంకరణలో దర్శనమిచ్చారు. వేకువజామున అర్చకులు ప్రత్యేకంగా పసుపు కొమ్ములను మాలలుగా తయారు చేసి వాటిని అందంగా అమ్మ విగ్రహానికి అలంకరించారు. సెలవుదినం కావడంతో పట్టణవాసులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. కుటుంబాలతో సహా విచ్చేసేవారు కాటేజీలతో పాటు చుట్టుపక్కల తోటల్లో వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో కె.ఎల్.సుధారాణి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అనకాపల్లిలో 120 అడుగుల వినాయక విగ్రహం

▸▸ పూజలు చేసి నిర్మాణ పనులను ప్రారంభించిన జగదీశ్, రత్నాకర్



విగ్రహం నిర్మాణ పనులకు పూజ చేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 120 అడుగుల లక్ష్మీగణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు జోరుగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ విగ్రహం నిర్మాణ పనులను ఆదివారం పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం రత్నాకర్ విగ్రహ నమూనా పోస్టర్‌ను ఆవిష్కరించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో ఈ ఏడాది ఇంతటి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండడం ఆనందదాయకమన్నారు. వినాయక చవితి రోజున ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలతో పూజలు చేయాలని కోరారు. ఈ విగ్రహాన్ని శిల్పి కామధేను ప్రసాద్ పర్యవేక్షణలో మట్టితో తయారు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బుద్ద భూలోకనాయుడుతో పాటు వాకాడ నరసింహారావు, ముత్తా ఈశ్వరరావు, ఆళ్ల ప్రవీణ్, దొడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంటు



క్రికెట్ టోర్నమెంటులో పాల్గొన్న న్యాయవాదులు

కొత్తూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో ఆదివారం న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంటును నిర్వహించారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను తొలుత పదో అదనపు జిల్లా జడ్జి నరేష్, అడిషనల్ సబ్ కోర్టు జడ్జి రామకృష్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు ప్రారంభించారు. న్యాయవాదులు ఉత్సాహంగా ఆడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లా హరశ్రీనివాసరావు, కార్యదర్శి బంధం రమణ, ఉపాధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలి : ఐద్వా



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం

పరవాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ, పరిసర ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణకు అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ నిర్వహించిన ఐద్వా జిల్లా మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఫార్మా కాలుష్యంతో పాటు హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా చేస్తున్న లారీల కారణంగా కాలుష్యం తీవ్రత మరింత పెరిగిందన్నారు. ఈ కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో బెల్టుషాపుల వలన ఎక్కువగా తగాదాలు జరుగుతున్నాయని వాపోయారు. ఈ సమావేశంలో ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బంగారమ్మ, టి.అన్నపూర్ణ, సభ్యులు అరుణ, రాజకుమారి, దేవి, వరలక్ష్మి, బేగం, బంగారం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి

చోడవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీగ్రామంలో ఆదివారం రాత్రి విద్యుదా ఘాతానికి గురై తాపీమేస్త్రి దూది రాము (45) మృతి చెందాడు. గాంధీగ్రామం సిటిజన్ కాలనీ నెంబర్‌వన్ హాస్టల్ సమీపంలో నివసిస్తున్న రాము ఆదివారం రాత్రి ఇంటిలో స్నానం చేస్తున్న సమయంలో పక్కనే వెళుతున్న కరెంట్ హెచ్‌టి లైన్ వైర్లు తగలడంతో షాక్‌కి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై సర్పంచ్, మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, తాపీమేస్త్రి రాము మృతికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమనని గాంధీగ్రామం సర్పంచ్ గాడి అప్పారావు ఆరోపించారు. ఇళ్లపై నుంచి వెళుతున్న విద్యుత్ లైన్లు తొలగించాలని ఎన్నోసార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, ఇప్పటికి నలుగురు వ్యక్తులు ఇలాగే మృతి చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేస్త్రి మరణానికి కారణమైన విద్యుత్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాము కాటుతో బాలుడికి అస్వస్థత

కృష్ణాదేవిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామానికి చెందిన కోనా రత్నరాజు (14) ఆదివారం పాముకాటు గురయ్యాడు. అల్లూరి సీతారామరాజు పార్కులో స్నేహితులతో కలిసి ఫొటోలు తీసుకునే సమయంలో గడ్డిలోకి వెళ్లడంతో పాము కాటు వేసింది. దీంతో అస్వస్థతకు గురైన రాజును సహచర విద్యార్థులు వెంటనే పీహెచ్‌సీలో చేర్చగా, ప్రథమ చికిత్స అనంతరం 108 ద్వారా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇష్టారాజ్యం.. అవగాహన పూజ్యం

▸▸ అధ్వానంగా కూరగాయల మార్కెట్ ▸▸ సెలవు రోజున పారిశుధ్య సిబ్బంది రారని తెలిసినా ఎక్కడికక్కడ వ్యర్థాలను పారబోస్తున్న వ్యాపారులు ▸▸ దుర్వాసనతో జనం అవస్థలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కూరగాయల మార్కెట్ అధ్వానంగా మారింది. ఎక్కడపడితే అక్కడ కూరగాయల వ్యర్థాలు దర్శనమిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పరిసరాలతో పాటు, ఆనుకొని ఉన్న రహదారుల్లో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం రోజున జీవీఎంసీ కార్మికులకు సెలవు దినం కావడంతో చెత్త ఎత్తేందుకు వారు రారని తెలిసినప్పటికీ పలువురు వ్యాపారులు వ్యర్థాలను ఒకచోట నిల్వ



హోల్‌సేల్ దుకాణాల వద్ద పేరుకుపోయిన కూరగాయల వ్యర్థాలు



అనకాపల్లిలో కూరగాయల మార్కెట్

చేయకుండా ఇష్టానుసారంగా మార్కెట్ ఆవరణ, మార్కెట్‌కు ఆనుకొని ఉన్న రహదారుల్లో కుప్పలుగా పారబోస్తున్నారు. దీనివల్లే ఈ సమస్య ఎదురవుతోందని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ద్వారా పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిస్తూ పలు కార్యక్రమాలు చేపడుతున్నా పలువురు వ్యాపారుల చెవికి ఎక్కడం లేదు. ఫలితంగా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ ఇలా వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారని పలువురు పట్టణవాసులు వాపోతున్నారు. సెలవు రోజుల్లో ఇళ్లలో చెత్తను మహిళలు టిన్‌లలో వేసి ఉంచుతున్నట్టుగానే వ్యాపారులు కూడా బాధ్యతగా ఇలా వ్యవహరిస్తే ఎవరికీ ఎటువంటి సమస్యలు ఉండవని పలు వురు సూచిస్తున్నారు. ఈ దిశగా వీరిని జీవీఎంసీ అధికారులు చైతన్యవంతులను చేయాలని పేర్కొంటున్నారు.



మార్కెట్‌ను ఆనుకొని ఉన్న రోడ్డులో...

ఉత్తమ బోధకులకు ఎల్లప్పుడూ గుర్తింపు

▸▸ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం ముగింపోత్సవంలో డీఈవో

సబ్బవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమంగా విద్యాబోధన చేసే ఉపాధ్యాయులను విద్యార్థులు జీవిత కాలం గుర్తుపెట్టుకుంటారని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయులకు మొదటి విడత జరుగుతున్న శిక్షణ శిబిరం ఆదివారం ముగిసిన సందర్భంగా ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థుల పట్ల ప్రేమగా వ్యవహరించాలన్నారు. లేనిపక్షంలో వారు బడికి దూరమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.జయప్రకాశ్ మాట్లాడుతూ తెలుగు బోధన సమయంలో పాటలు, కథలు తదితరాల ద్వారా విద్యార్థులను హత్తుకునేలా బోధించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో పక్కాగా అమలు చేసి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ శేషగిరిరావు, ఎంఈవో-2 ఎంజే రాజేంద్రబాబు, జిల్లా బాలికాభివృద్ధి అధికారి ఏఎస్‌డీ జెమీనా, ఏఎంవో కెజియో, జిల్లా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలపై పోరాటాలు

▸▸ ఎస్‌ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఇక్కడి దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం నిర్వహించిన ఫెడరేషన్ జిల్లా ప్లీనం సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం తిరోగమనంలో ఉందన్నారు. విద్యార్థులకు రావలసిన విద్యాదీవెన, వసతి దీవెన నేటికీ అందకపోవడం విచారకరమన్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. అలాగే, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని, యూనివర్సిటీలో అధ్యాపకుల కొరత వేధిస్తుందని వివరించారు. నేటికీ తల్లికి వందనం అనేక మందికి రాలేదని తెలిపారు. ప్రభుత్వ విద్యను కార్పొరేట్ విద్యా సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలల్లో భాగంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చారని ఈ నపథ్యంలో రానున్న రోజుల్లో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రతినిధులు విజయ్, వెంకటలక్ష్మి, డి.దివాకర్, కృపానంద పాల్గొన్నారు.

మాస్టర్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్‌లో శ్రీనివాస్‌కు బంగారు పతకం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్రం కోజికోట్‌లో ఈ నెల రెండో తేదీన ప్రారంభమైన మాస్టర్స్ స్త్రీ, పురుషుల జాతీయస్థాయి క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన 53 ఏళ్ల ఎం.శ్రీనివాస్ బంగారు పతకాన్ని సాధించారు. మాస్టర్స్-2 కేటగిరిలో పురుషుల 59 కిలోల విభాగంలో రాష్ట్రం తరఫున ప్రాతినిథ్యం వహించి స్క్వాట్‌లో 147.5 కిలోలు, డెడ్ లిఫ్ట్‌లో 192.5 కిలోల బరువు ఎత్తి రెండు జాతీయ రికార్డులు నెలకొల్పారు. మొత్తం 432.5 కిలోలతో ఓవరాల్ గోల్డ్ మెడల్ సాధించారని ఎస్‌కేపీ పవర్ సిటీ జిమ్ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. నేషనల్ పవర్ లిఫ్టర్ కోచ్ వసాది నానాజీ వద్ద శ్రీనివాస్ శిక్షణ పొందారు. ఈయన విజయం పట్ల అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు నీలా, అజయ్, హర్షం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే, శ్రీనివాస్ తదుపరి జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యే అవకాశాలున్నాయని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.



బంగారు పతకం సాధించిన శ్రీనివాస్

మోటారు కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

కశింకోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మోటారు కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నర్సింగబిల్లి జాతీయ రహదారిపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను విస్మరించడం తగదన్నారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీనివల్ల ఆటో, వ్యాను, ట్యాక్సీ తదితర మోటారు వాహనాలపై ఆధారపడి జీవించే కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే వీరిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దాకారపు శ్రీనివాసరావు, శివశంకర్, ఎం.వర, ఎం.శ్రీను, ఎం.బాలాజీ, పి.రాజు, ఎస్.రవి, ఎస్.సీతారాం, రాజు, ఎం.ఎస్.ఎన్.నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



నర్సింగబిల్లిలో నినాదాలు చేస్తున్న ఆటో, మోటారు కార్మికులు

'ఎమ్మెల్యే దృష్టికి టిడ్కో కాలనీలో సమస్యలు'



సమావేశంలో మాట్లాడుతున్న మళ్ళ శ్రీను

కొత్తూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో గృహ సముదాయంలో సమస్యలపరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని టీడీపీ నాయకుడు మళ్ళ శ్రీను అన్నారు. సత్యనారాయణపురం పంచాయతీలో ఉన్న ఎన్టీఆర్‌నగర్ కాలనీలో ఆదివారం జరిగిన గృహల యజమానుల సంఘ సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే కాలనీలో సమస్యలను ఎమ్మెల్యే కొణతాల దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు. అనంతరం ఎన్టీఆర్‌నగర్ అధ్యక్షుడు దంగేటి ప్రసాద్, కార్యదర్శి ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ కాలనీలో వీధి దీపాలు, రహదారులు, సురక్షిత తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంయుక్త కార్యదర్శి పి.సూర్య, కోశాధికారి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

తుమ్మపాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా కార్మికులు ఎదు ర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఆదివారం అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నూతన చట్టాలను రద్దు చేయడంతో పాటు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వియ్యపు రాజు, కోరిబిల్లి శంకరరావు, నరాలశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న సురేంద్ర

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి దాసరిగెడ్డ రోడ్డులోని సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నసమారాధన జరిపారు.

సాలాపువానిపాలెంలో సంక్షేమ పథకాలపై టీడీపీ నేతల ప్రచారం

లంకెలపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 84వ వార్డు పరిధి సాలాపువానిపాలెంలో ఆదివారం టీడీపీ శ్రేణులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ కార్యదర్శి సాలాపు మోహన్‌రావు, సాలాపు సుమన్ అప్పారావు, కరణం గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కేటగిరిలో మిగుల సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

సబ్బవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లాలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి, 11వ తర గతిలలో ఎస్సీ కేటగిరిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా గురుకులాల కో-ఆర్డినేటర్ ఎన్.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కొత్తూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : క్వారీ సామగ్రిని భద్రపరిచే షెడ్డులో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలివి. మాకవరం గ్రామానికి చెందిన నడిపల్లి శ్రీను (28) క్వారీ, క్రషర్లకు సంబంధించిన సామగ్రిని సరఫరా చేస్తుండేవాడు. తరచూ భార్యతో గొడవపడుతూ ఉండేవాడు. దీంతో జూలై 31న ఆమె అగనంపూడిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. శనివారం రాత్రి ఫోన్‌లో భార్యతో శ్రీను గొడవ పడ్డాడు. ఆదివారం ఉదయం ఆమె సొంత గ్రామమైన మాకవరం వచ్చేందుకు శ్రీనుకు ఫోన్ చేయగా ఎంతకీ లిఫ్ట్ చేయకపోవడంతో తన బావ అయిన సత్తిబాబుకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో అతడి కోసం వెతగ్గా మార్టూరు శివారున ఉన్న క్వారీ, క్రషర్లకు సంబంధించి షెడ్డులోపల హుక్కుకు ఉరేసుకొని కనిపించాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



పరమేశ్వరీ పార్కులో కలుసుకున్న స్నేహితులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గవరపాలెం పరమేశ్వరీ పార్కు జంక్షన్‌లో జగన్నాథస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దాడి బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, పోలారపు త్రినాథ్, మారిశెట్టి కుమార్, యల్లపు శ్రీను, కర్రి సుబ్రహ్మణ్యం, పొలమరశెట్టి చందు, యల్లపు నూకరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా రింగురోడ్డులో లాంగ్ వాక్ నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు పెంటకోట నరసింగరావు, చైర్మన్ పీఎస్ అప్పారావు, అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు, కార్యదర్శి పెంటకోట ప్రభాకర్, కోశాధికారి భర్నికాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న బెస్ట్‌ఫ్రెండ్స్ క్లబ్ ప్రతినిధులు

తుమ్మపాల : ఇక్కడి హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్‌లో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా జరిగింది. చిన్నారులు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టి గ్రీటింగ్ కార్డులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కరస్పాండెంట్ ఎస్. గిరీష్‌కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

లంకెలపాలెం : స్నేహితుల దినోత్సవం సందర్భంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998- 99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారంతా కలుసుకున్నారు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. అనంతరం పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకుని సాయంత్రం వరకు సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు సాలాపు కనకరాజు, బలిరెడ్డి శ్రీనివాస్, మడక రమేశ్ నాయుడు, మామిడి నాగరాజు, చింతల శ్యామ్, గెంజి రాజు, ఉమామహేశ్, ఎలమర్తి శ్రీనివాస్, ఇందల అప్పలరాజు పాల్గొన్నారు.



నిత్యం తెరిచి ఉంటున్న ఇరు రాష్ట్రాల సరిహద్దులోని జోలాపుట్టు జలాశయ గేట్లు



పెదబయలు సమీపంలో వంతెనపైనుంచే ఒడిశాలోకి పరారైన ఇటీవల దారిదోపిడీకి పాల్పడిన దొంగలు

హడలెత్తిస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా

- దారి దోపిడీలు, దొంగతనాలతో హల్‌చల్
- తుపాకులు, కత్తులు చూపించి బెదిరింపు
- సరిహద్దులో జలాశయాల వద్ద తనిఖీలు శూన్యం
- చోరీల నియంత్రణలో పోలీసులు విఫలం

ముంచంగిపుట్టు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా అంతర్రాష్ట్ర దొంగల ముఠా హల్‌చల్ చేస్తోంది. ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాలను కలిపే వంతెనలు, జలాశయాల వద్ద తనిఖీలు తూతూమంత్రంగా ఉండటంతో దొంగలపాలిట వరంగా మారింది. దీంతో ఏవోబీ కేంద్రంగా దొంగలు తమ కార్యకలాపాలను సులభతరంగా చేసుకుపోతున్నారు. గతేడాది వరుస చోరీలతో ప్రజలను బెంబేలెత్తించిన దొంగలు గతకొంత కాలంగా స్తబ్దుగా ఉన్నారు. అయితే, తాజాగా మండలంలోని బంగారుమెట్ట సమీపంలో గురువారం దారి కాసి పెదబయలు మండలం బొండాపల్లి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించి కత్తులు, తుపాకీతో బెదిరించి రూ.15 లక్షలు ఎత్తుకుపోయిన విషయం తెలిసిందే. ఈ దోపిడీకి పాల్పడిన ఒడిశాకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ ఆదివారం తెలిపారు. ఈ నిందితుల వెనుక పెద్ద దోపిడీ దొంగల ముఠా ఉన్నట్టు తెలుస్తోంది. గతేడాది ఇదే తరహా పలు దారి దోపిడీలు, దొంగతనా లు జరిగా యి. గత ఏడాది మార్చిలో మండలంలో గల మాకవరం పంచాయతీ కేంద్రంలో అర్ధరాత్రి ఓ ఇంట్లో కత్తులు, తుపాకులతో సుమారు పది మందికిపైగా వ్యక్తులు ప్రవేశించి భారీ చోరీకి పాల్పడ్డారు. అలాగే అదే ఏ డాది మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి సమీపంలో ఒక కిరాణా షాప్‌లో దొంగలు చొరబడి కొంత నగదు, సామాన్లను ఎత్తుకుపోయారు. అలాగే, జోలాపుట్టు మార్గంలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తులు కత్తులు చూపించి సుమారు రూ. 5వేలు తీసుకుపోయారు. మాకవరం సమీపంలో జోలాపుట్టు నుంచి స్వగ్రామానికి వె ళ్తున్న సర్పంచ్‌ను రాత్రి సమయంలో దాదాపు నలుగురైదురు దుండగులు కత్తులు, తుపాకీతో బెదిరించి అతని వద్ద నుంచి కొంత డబ్బులు అపహరించుకుపోయారు. మండలంలోని మారుమూల లక్ష్మీపురం సమీపంలో విధులు ముగించుకొని మూడురోజుల కిందట స్వగ్రామానికి వస్తున్న సచివాలయ ఉద్యోగిని ఇద్దరు వ్యక్తులు బెదిరించి, అతని ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకుపోయిన విషయం తెలిసిందే. ఇలా గతేడాది వరుస దోపిడిలతో దొంగలు హల్‌చల్ చేశారు. ఈ ఆగంతకులు మాత్రం ఇప్పటి వరకు దొరకలేదు. గత కొంత కాలంగా నిశ్శబ్దంగా ఉన్న దొం గలు మండలంలో బంగారుమెట్ట సమీపంలో తాజాగా దారి దోపిడీకి పాల్పడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలికిపాటుకు లోనయ్యా రు. ఈ సంఘటనలో ముగ్గురు ఒడిశాకు చెందిన ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. ఈ దారి దోపిడీ వెనుక మరి కొంతమంది హస్తం ఉండే ఉంటుందని, ఇద్దరు, ముగ్గురు వ్యక్తుల వల్ల ఇటువంటి దోపిడీలు చేయడం సాధ్యం కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన దారి దోపిడీలు, చోరీలు చూస్తుంటే అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులున్నట్టు తెలుస్తోంది.

ఆంధ్రాలో చోరీ.. ఒడిశాలోకి పరారీ

ఆంధ్రా - ఒడిశా రాష్ట్రాల ప్రజలు రాకపోకలు సాగించే జోలాపుట్టు, డుడుమ జలాశయాల వద్ద గస్తీ కానరావడంలేదు. ఆయా జలాశయాలపై వాహన రాకపోకలు సాగించే మార్గంలో గేట్లు నిత్యం తెరిచే ఉంటున్నాయి. అలాగే, ప్రాజెక్టుకు సంబంధించిన సె క్యూరిటీ గా ర్డు లు నిరంతరం గస్తీ నిర్వహించాల్సి ఉంది. కానీ ఇవేవీలేక దొంగలు తమ పనిని సులువుగా చేసుకుని ఆయా జలాశయాల మీదుగా ఒడిశావైపు వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. గతేడాది మాకవరంలో భారీ చోరీ చేసిన దొంగల ముఠా చోరీ అనంతరం ఓ వాహనంపై డుడుమ జలాశయంపై నుంచే ఒడిశావైపు వెళ్లినట్లు సమాచారం. గతంలో సైతం ఒడిశాకు చెందిన ద్విచక్ర వాహన దొంగల ముఠా వాహనాలను జోలాపుట్టు జలాశయంపై నుంచే ఒడిశాకు తీసుకుపోయారు. అప్పట్లో ముంచంగిపుట్టు పోలీసులు చాకచక్యంగా ఈ దొంగల ముఠాను పట్టుకున్నారు. గత గురువారం బంగారుమెట్ట సమీపంలో భారీ దారి దోపిడికి పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు పెదబయలు సమీపంలో ఇరురాష్ట్రాలను కలిపే వంతెనపై నుంచి ఒడిశాకు సులువుగా వెళ్లిపోయారు.

సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- టీడీపీ అరకు ఇన్‌చార్జి, ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర



సమావేశంలో మాట్లాడుతున్న అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

పెదబయలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల ఎన్నికలు పార్టీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర, పరిశీలకులు శివరామ కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడు వెచ్చంగి కొండయ్య, కార్యదర్శిగా రాజారావు, ఉపాధ్యక్షుడిగా అశోక్ కుమార్‌లను కార్యకర్తలు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దొన్నుదొర, శివరామకృష్ణ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నూతన కార్యవర్గానికి సూచించారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో భాగం కావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షురాలు సీకరి సుకుమారి, ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు, సర్పంచులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏవోబీ సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు

- మావోయిస్టు వారోత్సవాల ముగింపు రోజున అప్రమత్తం



సీలేరులో జెన్‌కో చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

సీలేరు, ఆగస్టు 3 , (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రేహౌం డ్స్, సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలు ఆదివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాయి. పీఎల్‌జీకే వారోత్సవాలు ఆదివారంతో ముగుస్తుండటంతో మావోయిస్టులు ఉనికిని చాటుకునేందుకు సరిహద్దు ప్రాంతాల్లో ఏవైనా విధ్వంసక చర్యలకు పాల్పడతారన్న నిఘా వర్గాల హెచ్చరికల మేరకు స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాలు, సరిహద్దు ప్రాంతాలలో పోలీసు బలగాలను మోహరించి ముమ్మరంగా తనిఖీలను నిర్వహించారు. స్థానిక జెన్‌కో చెక్‌పోస్టు వద్ద ఏవోబీ సరిహద్దు ప్రాంతమైన చిత్రకొండ కూడలి వద్ద సరిహద్దుల నుంచి వచ్చి, పోయే వాహనాలను, ప్ర యాణించే వ్యక్తులను సోదాలు చేశారు. అనుమానిత వ్యక్తులనుఆరా తీశారు. మావోయిస్టుల వారోత్సవాలు ఆదివారంతో ప్రశాంతంగా ముగియడంతో ప్రజలు, పోలీసు ఊపిరి పీల్చుకున్నారు.

రూ.లక్షలు వెచ్చించారు... వృథాగా వదిలేశారు

- జీకే వీధిలో గిరిజన సంక్షేమ శాఖ భవనం దుస్థితి



పిచ్చిమొక్కల మధ్య గిరిజన సంక్షేమశాఖ భవనం

గూడెంకొత్తవీధి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రూ. 40 లక్షలు వెచ్చించి గిరిజన సంక్షేమ శాఖ నిర్మించిన ఇంజనీరింగ్ కార్యాలయం భవనం నిరుపయోగంగా వదిలేశారు. టీడీపీ ప్రభుత్వ హయంలో గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులకు కార్యాలయాలను నిర్మించారు. 2018లో రూ.40లక్షల నిధులతో మండల కేంద్రంలో కార్యాలయాన్ని పూర్తి చేశారు. ఇందులో విశాలమైన నాలుగు గదులు, వాష్‌రూమ్స్ మరుగుదొడ్లు ఉన్నాయి. అనంతరం ఈ కార్యాలయం వినియోగించకపోవడంతో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. గోడల రంగులు వెలిసిపోతున్నాయి. ప్రస్తుతం జీకేవీధి గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారి చింతపల్లి సబ్ డివిజన్ కార్యాలయం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ కార్యాలయాన్ని ప్రభుత్వ కార్యాలయాలులేని యూ కో బ్యాంక్, కోపరేటివ్ సొసైటీకి కేటాయిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తకు గాయాలు



ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొర్ర కుమారి

చింతపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం జీకేవీధి మండలం అన్నవరం గ్రామానికి చెందిన కొర్ర రమేష్, కొర్ర కుమారి దంపతులు ద్విచక్రవాహనంలో చింతపల్లి వస్తున్నారు. అదే సమయంలో తునికి చెందిన భక్తులు ధారకొండ ధారాలమ్మ దర్శనం చేసుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. హనుమాన్ జంక్షన్ వద్ద ఓవర్ టేక్ చేస్తున్న కారు వెనుకభాగం బైక్‌కు తగిలింది. దీంతో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు రమేశ్, కుమారి కింద పడిపోవడంతో గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్‌పై ప్రకటన చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాలదేవ్



గిరిజన సంఘం జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు బాలదేవ్

అరకులోయ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో భాగంగా షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనులకు వందశాతం రిజర్వేషన్ అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దుబాలదేవ్ డిమాండ్‌చేశారు. ఆదివారం శర్భగుడ కాలనీలో ప్రపంచ దినోత్సవంలో భాగంగా ఆదివాసీ గిరిజనసంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమం మండల ఉపాధ్యక్షుడు కిల్లో జగన్నాధన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పొద్దుబాలదేవ్ మాట్లాడుతూ ప్రపంచదివాసీ దినోత్సవం ఈ నెల 9న జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవో 3కు ప్రత్యామ్నాయంగా వందశాతం ఆదివాసీలకు రిజర్వేషన్ అమలుపై ప్రకటన చేయాలన్నారు. ఏజెన్సీ ఏజెన్సీప్రాంతంలో 1/70, పెసా కమిటీ చట్టాలు, అటవీ హక్కులచట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక చట్టం, ఆదివాసీ స్పెషల్ డీ స్సీపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. అనంతగిరి, చింతపల్లి మండలాల్లో పెదకోట, గుజ్జెలి, చిట్టంపాడు ఎర్రవరం ప్రాంతాల్లో హైడ్రోపవర్‌ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని డిమాండచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మగ్గన్న, ఆనంద్, గోపీ , లక్ష్మణ్, రాజు, మహేశ్, గణేశ్, గోపాల్, శివ, శంకర్, మెహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు



సీలేరు మైదానంలో కబడ్డీ కోర్టు సిద్ధం చేస్తున్న జెన్‌కో సిబ్బంది

సీలేరు, ఆగస్టు 3 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో జెన్‌కో ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక జెన్‌కో అధికారులు డీఏవీ పాఠశాల క్రీడా మైదానంలో కోర్టులు సిద్ధం చేస్తున్నారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర నలుమూల నుంచి వచ్చే సుమారు 250 మంది క్రీడాకారులకు వసతి సౌకర్యాలను స్థానిక స్పోర్ట్స్ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీలేరులోని జెన్‌కో గేస్ట్ హౌసలతో పాటు ప్రైవేట్‌క్ష లాడ్జీలను క్రీడాకారుల కోసం రిజర్వు చేశారు. సీలేరు జెన్‌కో హోం టీం కెప్టెన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఫ్లడ్ లైట్స్ కాంతుల్లో ముమ్మరంగా క్రీడాకారులు సాధన చేస్తున్నారు.

అన్నవరం సచివాలయంలో ఆధార్ సేవలు



గ్రామ సచివాలయంలో అందిస్తున్న ఆధార్ సేవలు

చింతపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ప్రాంతీయుల విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో సచివాలయంలో ఆదివారం ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని పునఃప్రారంభించారు. అన్నవరం పరిసర ప్రాంత లోతుగెడ్డ, తమ్మంగులు, బలపం, బెన్నవరం, కొత్తపాలెం, కుడుముసారి పంచాయతీల ప్రజలు చింతపల్లి వెళ్లాల్సిన అవసరం లేదని, వివిధ రకాల ఆధార్ సేవలు తమ గ్రామ సచివాలయంలో పొందవచ్చునని కార్యదర్శి సింహాద్రినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంగరాజు, సచివాలయం ఉద్యోగులు మధు, కృష్ణ, శాంతి, వినోద్ పాల్గొన్నారు.

చింతపల్లి కేంద్రంగా అసెంబ్లీ నియోజకవర్గం

- గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుల డిమాండ్



చింతపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం నాయకులు

చింతపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చింతపల్లిని అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం, అఖిల పక్షం, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు సంయుక్తంగా వెనుకబాటుకి గురైన చింతపల్లి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజనలో చింతపల్లికి ప్రాధాన్యం కల్పించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో చింతపల్లిని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటుకు ప్రతిపాదనలు జరిగాయన్నారు. అలాగే ప్రజల సౌకర్యార్థం ఇక్కడ మినీ ఐటీడీఏను ఏర్పాటు చేయాలన్నారు. చింతపల్లిలో నవోదయ పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల, హార్టికల్చర్ కళాశాలతోపాటూ వంద పడకల ఆస్పత్రికి అనుబంధనంగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ డిమాండ్లతో కూడిన లేఖలను జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి గిరిజన ఉద్యోగుల సంఘం, అఖిల పక్షం పంపించనున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు రీమల ఆనందరావు, నవభారత్, పెదిరెడ్ల బేతాళుడు, సుర్లవీరేంద్ర, జల్లి సుధాకర్, గొర్లె వీరవెంకట్, గిరిజన సంఘ నాయకులు లోచలి రామకృష్ణ, యూవీగిరి, బౌడు గంగరాజు, గెమ్మెలి మోహన్‌రావు, దేవూరి శశికుమార్, గిరిజన జనజాగృతి రాష్ట్ర అధ్యక్షులు ముర్ల వెంకట రమణ పాల్గొన్నారు.

సీఆర్‌టీ ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న ఏపీసీ స్వామినాయుడు

అరకులోయ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని 12 జిల్లాలకు చెందిన కేజీబీవీలలో పనిచేస్తున్న సోషల్ స్టడీస్ సీఆర్టీ ఉపాధ్యాయులు ఇన్‌సర్వీసుపై ఏర్పాటు చేసిన నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని ఏపీసీ డాక్టర్ స్వామినాయుడు తెలిపారు. ఆదివారం అల్లూరి జిల్లా, మన్యం, పల్నాడు , ప్రకాశం, బాపట్ల, ఎన్టీఆర్, విశాఖపట్నం, , కాకినాడ, విజయనగరం, శ్రీకాకుళం, ఏలూరు జిల్లాలోని కేజీబీవీలలో పనిచేస్తున్న సోషల్ స్టడీస్ టీచర్లకు స్థానికంగా శిక్షణా కార్యక్రమంను ఎంఈవో త్రినాదరావుతో కలిసి స్వామినాయుడు ప్రారంభించారు. ఏడో తేదీవరకు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 12 జిల్లాల ఉపాధ్యాయు లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దనరావును కలిసిన టూరిజం డైరెక్టర్



మాజీ ఎమ్మెల్సీ జనార్దనరావును కలిసిన టూరిజం డైరెక్టర్ రమేశ్‌నాయుడు, తదితరులు

పాడేరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దనరావును ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్‌నాయుడు ఆదివారం విజయవాడలోని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మన్యంలోని పరిస్థితులపై చర్చించారు. పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను ఆయనకు ఈసందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీసురేశ్‌కుమార్, ప్రతినిధులు శ్రీను, శశిశంకర్, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

‘ఎన్నికల హామీలు అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు’



అభివృద్ధి, సంక్షేమాన్ని కరపత్రాలందిస్తున్న ప్రసాద్, నాయకులు

చింతపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ అన్నారు. ఆదివారం యర్రబొమ్మలు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎన్నికల హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందన్నారు. పింఛన్ల సొమ్ము పెంపు, అర్హులందరికి పింఛన్లు, రేషన్ కార్డులు, ప్రతి విద్యార్థికి తల్లికి వందనం, తాజాగా రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేశారన్నారు. మెగా డీఎస్సీ ద్వారా భారీ సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు సదుపాయం అమలులోకి వస్తుందన్నారు. గత ఐదేళ్ల పాలించిన జగన్ రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేశారన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ, ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చుతున్నారన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. గిరిజనుల ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. పీఎం జన్‌మన్ ద్వారా అర్హులైన గిరిజనులందరికీ పక్కా గృహాలు, రూ.వెయ్యి కోట్లతో శివారు గ్రామాలకు తారు రోడ్లు, మెటల్ రోడ్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురిచేసిన అంజలి శనివారం రహదారిని రూ.2.84కోట్లతో ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. వీటిని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, దీన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి వైసీపీకి మంచి గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీఆర్‌టీ బేరా వెంకట రమణ, అతని భార్య హేమలత వైద్యం కోసం ఆయన ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు బేరా సత్యనారాయణ పడాల్, మాజీ ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కష్టాల్లో అన్నదాతలు

... 5వ పేజీ తరువాయి

వుంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా చెరువుల్లో నీరు చేరలేదు. దీంతో ఒక్క ఎకరంలో కూడా వరినాట్లు వేయలేదు. ఆకుమడులు బీటలు వారి వరి నారు ఎండిపోతున్నది. పొలాలను దమ్ము పట్టాల్సిన సమయంలో, దుక్కి దున్నుకుంటున్నారు. వారం రోజుల్లో వర్షాలు కురవకపోతే వరిసాగు లేనట్టేనని చెరువుల ఆయకట్టు రైతులు అంటున్నారు.

దేవరాపల్లి మండలంలో..

రైవాడ జలాశయం నుంచి గత వారం నీటిని విడుదల చేయగా, ఇప్పుడిప్పుడే దమ్ము, నాట్లు పనులు మొదలయ్యాయి. అయితే కాలువల చివరనున్న భూములకు ఇంకా నీరుచేరలేదు. ఈ కారణంగా వరినాట్లు కొంత ఆలస్యం అయ్యే అవకాశం వుందని రైతులు చెబుతున్నారు. ఇదిలావుండగా మండలంలోని నాగయ్యపేట, సీతంపేట వెంకటరాజపురం, తెనుగుపూడి, గర్శింగి, వాకపల్లి, తామరబ్బ, సోంపురం, సమ్మెద, చింతలపూడి తదితర గ్రామాల్లో వర్షాధార చెరువుల కింద వరి సాగు చేస్తుంటారు. పది రోజుల క్రితం కురిసిన వర్షాలతో కొంతమంది నాట్లు వేయగా, అనంతరం వర్షం లేకపోవడంతోపాటు ఎండలు మండిపోతుండడంతో వరినాట్లు ఎండిపోతున్నాయి. సాధారణంగా జూలై చివరినాటికి వరినాట్లుపూర్తవుతాయి. అయితే వర్షాభావం వల్ల చెరువుల్లో అరకొరగా నీరు చేరడం, నాట్లువేయడానికి సరిపడ నీరు లేకపోవడంతో ఇంతవరకు 20 శాతం విస్తీర్ణంలో కూడా వరినాట్లు వేయలేదు. కొంతమంది రైతులు సుమారు కిలోమీటర్ దూరంలో వున్న ఇతర రైతులకు చెందిన బోర్ల నుంచి ట్యూబుల ద్వారా నీటి తీసుకొని వరినాట్లు వేసుకుంటున్నారు.

సముద్ర తీరంలో ఇసుక దొంగలు

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు, విక్రయాలు జరిపేవారు. అయితే ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి అయిన అనిత, మండల అధికారులను ఆదేశించడంతో ఇసుక తవ్వకాలను నిలిపివేశారు. దీంతో అక్రమార్కుల కన్ను సముద్ర తీరంలోని ఇసుకపై పడింది. రెవెన్యూ, పోలీసు, గనులు, అటవీ శాఖల అధికారులు సముద్ర తీర ప్రాంతంలో నిఘా పెట్టి, ఇసుక అక్రడ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శరవేగంగా పందూరు వంతెన పనులు

... 5వ పేజీ తరువాయి

నిర్మాణ సామగ్రి ధరలు బాగా పెరగడంతో ప్రభుత్వం కేటాయించిన రూ.6 కోట్లతో ఇంతవరకే పనులు అయ్యాయంటూ కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. అధికారులు మళ్లీ అంచనాలు తయారు చేసి రూ.3 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తరువాత 2018 అక్టోబరుతో కాంట్రాక్టు గడువు ముగియడం, మరుసటి ఏడాది ఫిబ్రవరిలో ఎమ్మెల్సీ (ఉపాధ్యాయ) ఎన్నికల కోడ్, మార్చిలో సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వం నిధులు విడుదల చేయలేని పరిస్థితి ఏర్పడింది. సాధారణ ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు మిగిలిన అభివృద్ధి పనుల మాదిరిగానే పందూరు వంతెనను కూడా అటకెక్కించారు. అప్పటి నుంచి ఏటా ప్రతిపాదనలు పంపడం, రాజధాని స్థాయిలో బుట్టదాఖలు చేయడం ఆనవాయితీగా మారింది.

కూటమి ప్రభుత్వం రాకతో వంతెన పనుల్లో కదలిక

గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోం మంత్రి అనిత, పందూరు వంతెనపై ప్రత్యేక దృష్టి సారించారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి, వంతెన నిర్మాణానికి రూ.5.75 కోట్లు మంజూరు చేయించారు. ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన శంకుస్థాపన చేశారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్ పనులు వెంటనే మొదలుపెట్టారు. గతంలోనే పిల్లర్స్ నిర్మాణం పూర్తికావడంతో ఇప్పుడు వాటిపై రెండు వైపుల నుంచి శ్లాబులు వేస్తున్నారు. ప్రస్తుతం నదిలో నీటి ప్రవాహన లేకపోవడంతో వంతెన నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకం కలగడం లేదని అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌నాటికి పనులు పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



రైతు బజారు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

తుది దశలో మోడల్ రైతుబజారు

- రూ.2.5 కోట్లతో నిర్మాణం.. త్వరలోనే ప్రారంభం
- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న చంద్రన్న మోడల్ రైతుబజారు పనులు చివరి దశకు వచ్చాయని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. పట్టణంలో నిర్మితమవుతున్న రైతుబజారు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. దీన్ని జిల్లాలోనే మోడల్ రైతుబజారుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రైతుబజారుకు అన్నివైపు నుంచి రావడానికి వీలుగా రహదారి సౌకర్యంతో పాటు వాహనాల పార్కింగ్‌కు కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రైతుబజారులో 72 షాపులతో పాటు కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి కూడా సన్నాహాలు చేస్తున్నామన్నారు. రైతులు తమ ఉత్పత్తులు సులువుగా అమ్ముకునేలా వెసులుబాటు కల్పిస్తామన్నారు. అలాగే వినియోగదారులకు అందుబాటులో ఉండేలా పనులు చేపట్టామన్నారు. రైతుబజారు నిర్వహణకు ప్రత్యేకంగా నలుగురు పంచాయతీ సిబ్బందిని కూడా వినియోగిస్తామని, మరుగు దొడ్ల సౌకర్యం కూడా కల్పిస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. మరో రెండు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. భవిష్యత్‌లో రైతుబజారు పై భాగంలో కూడా షాపులు నిర్మించి అద్దెకు ఇచ్చే యోచన చేస్తున్నామన్నారు. త్వరలోనే మంత్రి లోకేశ్ ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అలాగే పంచాయతీకి ఆదాయం పెంచేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ పాత బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌ల పై భాగంలో దుకాణాలను నిర్మించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రైతుబజారులో పనులకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారి శాంతారాంకు ఎమ్మెల్యే సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గూనూరు మల్లునాయుడు, పప్పు శ్రీనివాసరావు, పార్దురాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు ప్రసాద్

మాకవరపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైవీడీ.ప్రసాదరావు డిమాండ్ చేశారు. మండలంలోని రాచపల్లి కామేశ్వరమ్మ గుడి వద్ద ఆదివారం జరిగిన కార్యదర్శుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కార్యదర్శులకు అధిక పంచాయతీలు అప్పజెప్పడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. తెల్లవారు ఆరు గంటలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ కాల్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల కార్యదర్శులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సర్వీస్ రూల్స్ ప్రకారం కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రుత్తల సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు శివ, డివిజన్ అధ్యక్షుడు రఘురాం, జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసు, అధిక సంఖ్యలో కార్యదర్శులు పాల్గొన్నారు.

సత్యనారాయణ మాస్టారు సేవలు ప్రశంసనీయం

- మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్



సత్యనారాయణ, మణికుమారి దంపతులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కృష్ణాదేవిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పడంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఉపాధ్యాయుడు గజ్జలపు సత్యనారాయణ సేవలు చిరస్మరణీయమని ప్రశంసనీమని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ కొనియాడారు. ఏఎల్‌పురం గ్రామంలో ఉద్యోగ విరమణ పొందినసత్యనారాయణను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా గజ్జలపు సత్యనారాయణ, ఎంపీపీ గజ్జలపు మణికుమారి దంపతులను నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గణేష్, పలువురు వక్తలు మాట్లాడుతూ సుమారు 25 ఏళ్లుగా పలు ప్రాంతాల్లో విధులు నిర్వహించి ఎందరో విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దారన్నారు. చివరిగా సిహెచ్.నాగాపురంలో విధులు నిర్వహించి విరమణ పొందడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మునిసిపల్ చైర్మన్ బోడపాటి సుబ్బలక్ష్మి, గొలుగొండ, కొయ్యూరు జడ్పీటీసీ సభ్యులు గిరిబాబు, వారా నూకరాజు, ఎంఈవోలు సత్యనారాయణ, నాగేంద్ర, పీఆర్‌టీయూ జిల్లా నేత గోపీనాథ్, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మంచి సేవలే గుర్తింపు తెస్తాయి



వీఆర్వో నారాయణరావు దంపతులను సత్కరిస్తున్న నాయకులు, అధికారులు

రావికమతం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రజలకు అందించిన మంచి సేవలే ఉద్యోగులకు గుర్తింపు తీసుకువస్తాయని ఎంపీపీ పైల రాజు కొనియాడారు. రిటైర్డ్ వీఆర్వో పల్లా నారాయణరావుకు ఆదివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. కుటుంబీకులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, అభిమానులు వీఆర్వో నారాయణరావు దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వీఆర్వో నారాయణరావు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. నిరంతరం ప్రజలకు సేవలు అందించే వారికి ఇలాంటి ఆదరణే వస్తుందన్నారు. ఎటువంటి మచ్చ లేకుండా ఉద్యోగ విరమణ పొందడం ఉద్యోగికి ఎంతో అదృష్టమన్నారు. ఇంత మంది మధ్య కుటుంబ సభ్యుడిలా ఆదరాభిమానాలతో పదవీ విరమణ పొందడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇంత అభిమానం చూపడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని సన్మాన గ్రహీత నారాయణరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	83.00
లైవ్ ధర	103.00
విత్ స్కిన్	176.00
స్కిన్ లెస్	186.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

నాడు అధ్వానం.. నేడు సుందరం!

- రాజుపాలెం మట్టి మార్గానికి మోక్షం..
- రూ.1.3 కోట్లతో తారు రోడ్డు నిర్మాణం
- మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే రాజు
- గ్రామస్థులు, వాహన చోదకుల హర్షం





నాడు: బురదమయంగా ఉన్న రాజుపాలెం మట్టి మార్గం (ఫైల్)... నేడు: రూ.1.3 కోట్లతో నిర్మించిన చక్కటి తారు రోడ్డు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదపూడి శివారు రాజుపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఎట్టకేలకు కూటమి ప్రభుత్వ హయాంలో మోక్షం లభించింది. గతంలో ఈ మట్టి రోడ్డు బురదమయమై అధ్వాన స్థితిలో ఉండేది. ప్రయాణికులు, వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్రమైన ఇబ్బందులు తలెత్తేవి. అయినప్పటికీ వైసీపీ హయాంలో అభివృద్ధికి నోచుకోలేదు.

ఈ రోడ్డు నిర్మాణానికి 2018లో అప్పటి ఎమ్మెల్యే రాజు శిలాఫలకం వేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పూర్తికాలేదు. ఎన్నికల ముందు అప్పటి ఎమ్మెల్యే రాజు సొంత నిధులు వెచ్చించి గ్రావెల్‌తో గోతులు పూడ్చించారు. దీంతో కొంత వరకు రాకపోకలకు అంతరాయం లేకుండా ఉండేది. ఆ తరువాత ఎన్నికలు రావడం... కరణం ధర్మశ్రీ ఎమ్మెల్యే కావడంతో రాజుపాలెం రోడ్డుకు నిర్వహణ కొరవడింది. కనీసం రోడ్డు సదుపాయం కల్పించకుండా కాలయాపన చేశారు. దీంతో రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. ఫలితంగా రోగులు, చిన్నారులు, విద్యార్థులు, రోజువారీ కూలీలు నానా అవస్థలు పడేవారు. 2024లో ఎన్నికల ముందు ఈ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే ధర్మశ్రీ హడావుడిగా శిలాఫలకం ప్రారంభించారు. రహదారి మాత్రం పూర్తిచేయలేదు. అయితే గత ఎన్నికల ముందు మాట ఇచ్చిన ఎమ్మెల్యే రాజు తాత్కాలికంగా రోడ్డు నిర్మించి హామీ నిలుపుకున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.1.3 కోట్ల నాబార్డు, ఆర్‌ఐడీఎఫ్ నిధులతో తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో రాజుపాలెం గ్రామస్థులు, ప్రయాణికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజుతో పాటు రోడ్డు నిర్మాణానికి సహకరించిన విశాఖ డెయిరీ డైరెక్టర్ గెదల సత్యనారాయణ, నాయకుడు జి.కోటేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

రవాణా కష్టాలు తప్పాయి..

-నమ్మి సత్యనారాయణ, గ్రామస్థుడు, రాజుపాలెం

మా గ్రామంలో కూలి పనులపై ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తున్నారు. తామంతా నిత్యం అనకాపల్లి తదితర ప్రాంతాలకు పనుల కోసం వెళ్లి, వస్తుంటాం. రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. అధికారులకు, గత పాలకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. టీడీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మించడంతో ఇప్పుడు రవాణా కష్టాలు తప్పాయి.

ఏ ఇబ్బంది లేకుండా ప్రయాణిస్తున్నాం..

-ఎం.రామునాయుడు, గొర్రెల కాపరుల సంఘం మండల అధ్యక్షుడు

నా చిన్నతనం నుంచి ఈ రోడ్డు కోసం పెద్దలు ప్రయత్నించారు. కానీ, సాధ్యపడలేదు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి అష్ట కష్టాలు పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వంలో తారు రోడ్డు నిర్మించడం ఆనందంగా ఉంది. ఇప్పుడు ఇబ్బంది లేకుండా ప్రయాణాలు సాగిస్తున్నాం.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



ఫ్రెండ్‌షిప్ బ్యాండు కడుతున్న వాకర్స్ క్లబ్ సభ్యురాలు రాజేశ్వరి

నర్సీపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ మహిళా సభ్యురాలు పాలిమార్ రాజేశ్రీ ఆదివారం కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. మిత్రులంతా కష్టంలో... సుఖంలో కలిసిమెలిసి ఉండాలని, ఎటువంటి ఆటంకాలు లేకుండా ముందుకు సాగాలని శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అందరికీ ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను కట్టారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ ట్రెజరర్ అల్లు అప్పారావు మాట్లాడుతూ ఫ్రెండ్‌షిప్ డే రోజు సభ్యులంతా కలుసుకొని వేడుక జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు ఎంవీరంగారావు, విశ్రాంత ఎంఈవో జేఎస్ఎస్ నాగేశ్వరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాబీ మాస్టారు, సంయుక్త కార్యదర్శి శ్రీను, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరియా జలపాతం, రైవాడ జలాశయ పరిసర ప్రాంతాల్లో స్నేహితుల దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి యువతీ, యువకులు ఇక్కడికి వచ్చారు. కేకులు కట్ చేసి కేరింతలు కొట్టారు.

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు



జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేశ్

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో జనసేన పార్టీ బలపడడానికి కృషి చేయాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. నర్సీపట్నం మునిసిపాలిటీలో జనసేన సీనియర్ నాయకులు అప్పన దొరబాబు ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జన సైనికులు పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన కృషిని కార్యకర్తలకు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, మునిసిపల్ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, నాయకుడు వూడి చక్రవర్తి, నాలుగు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నాలుగు మండలాల జన సైనికులకు శిక్షణ శిబిరం

బుచ్చెయ్యపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాల జన సైనికులకు ఆదివారం శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు హాజరై పార్టీ పటిష్టత, సవాళ్లు ఎదుర్కోవడం, అధికార పక్షంలో భాగస్వాములుగా పనిచేయడం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పవీఎస్ ఎన్.రాజు, నాయకులు ఆడపా నరసింహమూర్తి, దాడి సూర్యనాగేశ్వరరావు, వీర మహిళలు, నాలుగు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధకులకు ఎల్లప్పుడూ గుర్తింపు

- ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం ముగింపోత్సవంలో డీఈవో



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

సబ్బవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమంగా విద్యాబోధన చేసే ఉపాధ్యాయులను విద్యార్థులు జీవిత కాలం గుర్తుపెట్టుకుంటారని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయులకు మొదటి విడత జరుగుతున్న శిక్షణ శిబిరం ఆదివారం ముగిసిన సందర్భంగా ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థుల పట్ల ప్రేమగా వ్యవహరించాలన్నారు. లేనిపక్షంలో వారు బడికి దూరమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.జయప్రకాశ్ మాట్లాడుతూ తెలుగు బోధన సమయంలో పాటలు, కథలు తదితరాల ద్వారా విద్యార్థులను హత్తుకునేలా బోధించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో పక్కాగా అమలు చేసి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ శేషగిరిరావు, ఎంఈవో-2 ఎంజే రాజేంద్రబాబు, జిల్లా బాలికాభివృద్ధి అధికారి ఏఎస్‌డీ జెమీనా, ఏఎంవో కెజియా, జిల్లా రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగంలో సమస్యలపై పోరాటాలు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఇక్కడి దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం నిర్వహించిన ఫెడరేషన్ జిల్లా ప్లీనం సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం తిరోగమనంలో ఉందన్నారు. విద్యార్థులకు రావలసిన విద్యాదీవెన, వసతి దీవెన నేటికీ అందకపోవడం విచారకరమన్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. అలాగే, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని, యూనివర్సిటీలో అధ్యాపకుల కొరత వేధిస్తుందని వివరించారు. నేటికీ తల్లికి వందనం అనేక మందికి రాలేదని తెలిపారు. ప్రభుత్వ విద్యను కార్పొరేట్ విద్యా సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలల్లో భాగంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చారని ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రతినిధులు విజయ్, వెంకటలక్ష్మి, డి.దివాకర్, కృపానంద పాల్గొన్నారు.

నిరుపేద గిరిజన యువతికి కానిస్టేబుల్ ఉద్యోగం



తల్లిదండ్రులతో కొరతం కృష్ణవేణి

దేవరాపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల సమ్మెద గ్రామానికి చెందిన గిరిజన యువతి కొరతం కృష్ణవేణి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. డిగ్రీ ఉత్తీర్ణులైన ఆమె ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసింది. నిరుపేద కుటుంబానికి చెందిన కృష్ణవేణి ఎలాగైనా ప్రభుత్వ కొలువు సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగింది. ఆమె ప్రయత్నం ఫలించి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. ఎస్టీ కేటగిరిలో 111 మార్కులతో కానిస్టేబుల్ పోస్టుకు ఆమె అర్హత సాధించారు. ఎస్ఐ, ఉపాధ్యాయ పోస్టు సాధించాన్నదే లక్ష్యమని ఈ సందర్భంగా కృష్ణవేణి చెప్పారు.

పాండవుల మెట్టపై ధ్వజ స్తంభం ప్రతిష్ఠోత్సవం

దేవరాపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేపల్లి పాండవుల మెట్టపై వెలసిన శ్రీదేవీభూదేవీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠోత్సవం ఆదివారం జరిగింది. ఆలయ అర్చకులు భారతానంద మహరాజ్, ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉప కులపతి ముర్రు ముత్యాలనాయుడు ధ్వజ స్తంభం ప్రత్యేకతను వివరించారు. మాజీ సర్పంచ్ రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

రావికమతం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): టి.అర్జాపురం గ్రామంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్, కంటి ఆసుపత్రి సహకారంతో సర్పంచ్ పాల్గుణ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. 70 మంది రోగులకు పరీక్షలు చేయగా, 20 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్‌లో చేశారు. కోఆర్డినేటర్ అశ్వనికుమార్ పాల్గొన్నారు.

దాలివలసలో 120 మందికి వైద్య సేవలు

కె.కోటపాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాలివలస గ్రామంలో 120 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కేజీహెచ్‌కు చెందిన ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ రామచంద్రరావు వైద్య సేవలు అందించారు. అలాగే క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మికుల సభలకు తరలిరండి

నర్సీపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల ఐదో జిల్లా మహాసభలక తరలిరావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. ఆదివారం నర్సీపట్నం, బలిఘట్టం, బయపురెడ్డిపాలెం, కాపువీధి, బీసీ కాలనీలో భవన నిర్మాణ కార్మికుల సంఘం సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంబిల్లి మండలంలో మంగళవారం జరగనున్న జిల్లా మహాసభలకు కార్మికలంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కె.రామకృష్ణ, మర్రి రమణ పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్‌కు క్రీడా సామగ్రి వితరణ

నర్సీపట్నం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ రెసిడెన్షియన్ స్కూల్‌కు పూర్వ విద్యార్థులు ఆదివారం క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. శనివారం రాత్రి విద్యార్థులతో కలిసి వారంతా బడిలో నిద్ర చేశారు. ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా సరదాగా ఆటలు ఆడారు. అనంతరం పాఠశాలకు క్రీడా సామగ్రి, గ్రంథాలయానికి పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్, కార్యదర్శి యల్లబిల్లి సన్నీ, ఎస్‌బీఐ మేనేజర్ డీవీఎన్ రమేశ్, పంచాయతీరాజ్ డీఈఈ జి.సత్యనారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఖండివరం రామాలయానికి నిధులు

చీడికాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖండివరం సీతారామాలయానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేయించారని సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి, మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, టీడీపీ నాయకులు బండారు దయాకర్, ఎస్‌వీఎస్.నాయుడులు ఆదివారం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ ఆలయం దూపదీప నైవేద్యానికి నోచుకోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం దేవదాయ శాఖ నుంచి నెలకు రూ.10 వేలు మంజూరు చేయించారన్నారు. ఈ మొత్తంలో దూపదీప నైవేద్యానికి రూ.7 వేలు, అర్చకునికి రూ.3 వేలు చెల్లించనున్నట్టు చెప్పారు. దీంతో ఎమ్మెల్యే బండారుకు గ్రామస్థులు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి

చోడవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీగ్రామంలో ఆదివారం రాత్రి విద్యుదాఘాతానికి గురై తాపీమేస్త్రి దూది రాము (45) మృతి చెందాడు. గాంధీగ్రామం సిటిజన్ కాలనీ నెంబర్‌వన్ హాస్టల్ సమీపంలో నివసిస్తున్న రాము ఆదివారం రాత్రి ఇంటిలో స్నానం చేస్తున్న సమయంలో పక్కనే వెళుతున్న కరెంట్ హెచ్‌టి లైన్ వైర్లు తగలడంతో షాక్‌కి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంపై సర్పంచ్, మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, తాపీమేస్త్రి రాము మృతికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని సర్పంచ్ గాడి అప్పారావు ఆరోపించారు. ఇళ్ల పై నుంచి వెళ్తున్న విద్యుత్ లైన్లు తొలగించాలని విద్యుత్ అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, ఇప్పటికే నలుగురు వ్యక్తులు ఇలాగే మృతి చెందారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మేస్త్రి మరణానికి కారణమైన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఐదుగురు కోడి పందెంరాయుళ్ల అరెస్టు



కోళ్లు, నిందితులతో పోలీసులు

రావికమతం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కోడి పందెం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపారు. మండలంలోని తోటకూరపాలెంలో నూకాలమ్మతల్లి పక్కన కోడి పందేలు నిర్వహిస్తుండగా శనివారం రాత్రి సిబ్బందితో దాడి చేశామన్నారు. దీంతో ఐదుగురు వ్యక్తులు వ్యక్తులు, ఐదు కోడి పుంజులు పట్టుబడినట్టు చెప్పారు. అలాగే రూ.1,750 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పాము కాటుతో బాలుడికి అస్వస్థత

కృష్ణాదేవిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామానికి చెందిన కోనా రత్నరాజు (14) ఆదివారం పాము కాటుకు గురయ్యాడు. అల్లూరి సీతారామరాజు పార్కులో స్నేహితులతో కలిసి ఫొటోలు తీసుకునే సమయంలో గడ్డిలోకి వెళ్లడంతో పాము కాటు వేసింది. దీంతో అస్వస్థతకు గురైన రాజును సహచర విద్యార్థులు వెంటనే పీహెచ్‌సీలో చేర్పగా, ప్రథమ చికిత్స అనంతరం 108 ద్వారా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.